# ప్రాజ్ఞి

రాజేశ్వర్రావు ఓ ఫారిన్ ఫర్మ్‌లో మేనేజరుగా పనిచేస్తున్నాడు. పచ్చని శరీరం, వుంగరాల జుట్టు మిసమిసలాడుతూ - పతివ్రతలకో పరీక్షలా వుంటాడు -

రాజేశ్వర్రావు అందాన్ని ఆశించని ఆడది, అసూయ చెందని మొగాడు వుండడు -

"ఆఁ! అదంతా మందు పట్టురా బ్రదర్! ఒక్క రోజు మందు పడకపోతే మనవాడు డీలా అయిపోడూ?!" కిట్టనివాళ్లు చాటుమాటుగా అనే మాటలు.

ఏది ఎలావున్నా, ఎవరేమనుకున్నా రాజేశ్వర్రావు ఖాతరుచేసేరకంకాదు. అదే అతనిలో ప్రత్యేకత. ముందు-వెనక, తోడు-నీడ ఎవరూ లేరు రాజేశ్వర్రావుకు. అందుచేత నెలకొచ్చే జీతం 8 వందలూ విందులు, వినోదాలు, విలాసాలకు విచ్చలవిడిగా ఖర్చుచేస్తాడు. భవిష్యత్తుమీద నమ్మకంలేదుకనుక వెనకెయ్యాలన్న తలంపే లేదు.

పిత్రార్జితం రెండంతస్తులమేడ - బ్యాంకులో పాతికవేల రూపాయల ఫిక్సెడ్ డిపాజిట్ మాత్రం వాటి జాతకం బావుండబట్టి చెక్కు చెదరకుండా వున్నాయి.

పెళ్లి చేసుకొని ఓయింటివాడైతే కొంచెమేనా దార్లో కొస్తాడన్న తలంపుతో, మిత్రులు హితులు, శ్రేయోభిలాషులు, చిన్న పెద్దా అంతా సలహాలిచ్చారు.

"చూద్దాం లెండి" అంటూ అందరికీ, ఒకే సమాధానమిచ్చేవాడు రాజేశ్వర్రావు.

★ ★ ★

రైలు కదిలే వేళకి హడావిడిగా పరుగు పరుగునవచ్చి కాళీగా కన్పించిన ఓఫస్టు క్లాసు కంపార్ట్‌మెంటులో కూర్చుంది వసంత జాపోస్తూ.

రాజేశ్వర్రావు లేవెట్రీ తలుపు తెరిచి బయటకువచ్చి ఒక్కలిప్తకాలం వసంతవేపు చూసి అవతలప్రక్క వున్న డోరు తెరచి అక్కడ హూందాగా నిల్చుని సిగరెట్ వెలిగించాడు.

వసంత మొదట కొంచెం కంగారుచెందినా "నెక్స్ట్‌హాల్ట్‌లో ఎలాగూ దిగిపోతాగదా"ని

కొంచెం ధైర్యం తెచ్చుకుంది. రాజేశ్వర్రావుని ఆపాదమస్తకం ఒక్కమారు చూసింది. అతని అందానికి ఆమె ఒళ్లు జలదరించింది. అతడు తనవేపు చూస్తాడేమో అని చాలిమార్లు చూసి నిరాశ చెందింది.

అతడు కనీసం బెర్త్‌మీద కూర్చోనన్నా కూర్చోకుండా గంటసేపు అలానే డోరు దగ్గర నిల్చుని సిగరెట్ తరువాత సిగరెట్ కాలుస్తూండడం చూసి వసంత కొంచెం బాధపడింది.

స్టేషను రాగానే అతను అప్పర్‌బెర్త్‌మీద వున్న తన కోటు తీసుకొని ఇటుప్రక్క డోరు వరకూ వచ్చి డోరు తెరుస్తూ కోటు విసురుగా భుజం మీద వేసుకున్నాడు. ఆ విసురుకు అతడి కోటు జేబులోవున్న పర్సు తృళ్లి వసంత కాళ్ల ముందు పడింది. రాజేశ్వర్రావు అది గమనించకుండా రైలుదిగి గబగబా ముందుకు నడుచుకు వెళ్తున్నాడు. వసంత పర్సుతీసి తెరిచింది. అందులో ఓ ఫస్టుక్లాసు టికేట్ వందరూపాయల నోట్లూ, పది రూపాయల నోట్లు అవి చాల వున్నాయి. వసంత గుండె దడదడలాడింది. పర్సు పట్టుకుని తను కూడా దిగి అతని వెనుక తొందరగా నడిచింది.

"గేటుదగ్గర టికెట్ కోసం జేబులు తడివివెనుకకు పరిగెత్తుకురాడూ?!" అంటూ కొంచెం ధీమా చెందింది.

కాని చిత్రం! అతడు గేటు దగ్గరకు వెళ్లేసర్కి టికెట్ కలక్టరు నవ్వుతూ విష్ చెయ్యడం - అతను ఆప్యాయంగా టికెట్ కలక్టర్ భుజం తడుతూ ముందుకు వెళ్లడం చూసి వసంత నిర్ఘాంత పోయింది.

గబగబా తను కూడా వెళ్లబోయే సర్కి టికెట్ అంటూ గేటుదగ్గర టికెట్ కలక్టరు అటకాయించాడు. బేగ్‌లో తన టికెట్ తీసి అతనికిచ్చి బయటకు వచ్చింది.

స్టేండులో పార్కుచేసివున్న ఓకారు దగ్గరకు అతను వెళ్లేసర్కి డ్రైవరు సెల్యూట్‌చేసి బేక్‌సీటు డోరుతెర్చి పట్టుకున్నాడు. చేతిలో వున్న కోటు సీటు మీద గిర్వాటేసి కారులో కూర్చునే సర్కి డ్రైవర్ ఇంజన్ స్టార్ట్ చేసాడు.

వసంత టాక్సీలో ఇల్లుచేరుకుంది. తన గదిలోకి వెళ్లి పర్సుతెర్చిచూసింది మొత్తం నాలుగు వందరూపాయల నోట్లు, ఆరు పదిరూపాయల నోట్లు, కొంతచిల్లర రెండు విజిటింగ్ కార్డులు, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఓ ఫస్టు క్లాసు టిక్కట్టూ వున్నాయందులో.

వసంత ఆఫోటోనుచూస్తూ తన్ను తాను మర్చిపోయింది. సిగ్గుతో ఆమె బుగ్గలు ఎరుపెక్కి పెదిమలు వణికాయి.

విజిటింగ్ కార్డుతీసి "రాజేశ్వర్రావు" అని అతని పేరు చదివి ఎడ్రస్ చూసింది.

టెలిఫోను రిసీవరు తీసి రాజేశ్వర్రావు యింటి నెంబరుకు డైల్‌చేసింది.

"హల్లో......"

"ఎవరు మాట్లాడుతున్నారు?"

"నానండీ అప్పన్నని....."

"రాజేశ్వర్రావుగారున్నారా?" దడదడలాడుతూన్న గుండెల్ని అదుపులో పెట్టుకుంటూ

అడిగింది వసంత.

"వేరండీ ఊర్నించొచ్చి ఎంటవే కచేరీకి ఎల్లిపోయారండి."

"మరెవరున్నారింట్లో?"

"ఇంకెవ్వురూ వేరండీ నానొక్కడ్నే వున్న"

"మీ అమ్మగారో.....?"

"ఏయమ్మగోరూ..... అదా మా బాబుకింకా పెళ్లి కానేదుగదండీ... తవరూ....."

వసంత రిసీవర్ చటుక్కున హుక్కుమీద పెట్టింది సంతోషంతో వుక్కిరి బిక్కిరైంది.

మర్నాడుదయం ట్రిమ్‌గా ముస్తాబై రాజేశ్వర్రావింటికి కారులో బయల్దేరింది వసంత.

గేటుముందు కారాపి వందగజాల్లో వున్న గుమ్మందగ్గరకు వెళ్ల కాలింగ్‌బెల్ నొక్కింది.

ఓ అర్థ శతమానం వయస్సుపై బడ్డ నౌకరొకడువచ్చి తలుపుతెర్చి ఆశ్చర్యంగా చూస్తూ నిల్చున్నాడు.

"నీ పేరు అప్పన్న!"

"అవునండీ" అన్నాడు మరింత ఆశ్చర్యంగా

"మీ అయ్యగారున్నారా?"

"మేడ మీదున్నారండి. అలా కూకోండి పిలుత్తా" అంటూ ఓ సోఫా చూపించాడు.

వసంత కూర్చుంది.

హాలంతా ఓమారు చూసింది గోడలకు లైట్ గ్రీన్ కలర్ పెయింటు చేయబడింది. రకరకాల చిత్రాలు వ్రేలాడుతున్నాయి. హాలు మధ్యలో నాలుగు సోఫాలు ఓటీపాయ్ వున్నాయి.

"గుడ్ మార్నింగ్!" అంటూ రాజేశ్వర్రావు చిరునవ్వుతో వచ్చి ఆమెకెదురుగా వున్న సోఫాలో కూర్చున్నాడు.

"నిన్న ట్రైన్‌లో మీ పర్సు పడిపోయింది" అంటూ వసంత అందించింది.

"థేంక్యూ ఫర్ ది ట్రబుల్ టేకెన్" అంటూ రాజేశ్వర్రావు పర్సందుకుని టీపాయ్ మీద వుంచాడు.

అప్పన్న ట్రేలో రెండుకప్పుల కాఫీ బిస్కట్లు తెచ్చి వారికిచ్చాడు.

రాజేశ్వర్రావు తన ముప్పై వసంతాల వయస్సులో ఎందరో అమ్మాయిల్ని చూసాడు. కాని వసంత అంత అందమైన అమ్మాయిని చూళ్లేదు. ఆమె అందం అతడ్ని బాగా ఆకర్షించింది.

వసంత వెళ్లిపోగానే రాజేశ్వర్రావు పర్సు తెరచి చూసాడు. అనుకున్నట్లే అతడి ఫోటో మిస్సవడం చూసి చిరునవ్వు నవ్వుకున్నాడు.

గత రెండు నెలల్లోనూ వసంత రాజేశ్వర్రావులు పలుమార్లు కల్సుకొని మాట్లాడారు. వారి స్నేహం దినదినాభివృద్ధి చెంది ప్రేమగా మారింది.

వసంత తన మనోనిశ్చయాన్ని తల్లిదండ్రుల కెరిగించి వారి అనుమతితో

రాజేశ్వర్రావును పెళ్లిచేసుకుంది.

హనీమూన్‌కి కాశ్మీర్, శ్రీనగర్ అవి ఓనెల రోజులు తిరిగొచ్చారు.

రాజేశ్వర్రావు నిజ స్వరూపం తెల్సుకుందికి అట్టే కాలం పట్టలేదు వసంతకు. అతడు అర్ధరాత్రి వరకూ ఏ క్లబ్బుల్లోనో గడిపి త్రాగిన మైకంలో ఇల్లు చేరుకుంటున్నాడు రోజూ.

వసంత ఎన్నోవిధాల అతడి ప్రవర్తన మార్పించాలని ప్రయత్నించి విఫలురాలైంది.

"నే ఒంటరితనం భరించలేకుండా వున్నాను మీరు అర్ధరాత్రి మైకంలో డ్రైవ్‌చేసుకురావడం చాల ప్రమాదం! నలుగురిలో అప్రతిష్ఠపాలు కాకుండా మనింట్లో మనం ఏంచేసుకున్నా ఎల్లావున్నా గుట్టుగా వుంటుంది! ఇంటిదగ్గర మీరేంచేసినా ఎలావున్న నాకేం అభ్యంతరంలేదు! సాయంత్రం మీరు త్వరగా యింటికివచ్చేయండి!" అంటూ ఓరోజు భర్తను వేడుకుంది వసంత.

రాజేశ్వర్రావ్ ఏమూడ్‌లో వున్నాడో కాని ఆమె మాటలు చెవికెక్కాయి.

సాయంత్రం వస్తున్నప్పుడు అరడజను బాటిల్సు కూడా తెచ్చుకున్నాడు.

రాత్రి బాటిల్ తెరిచి గ్లాసులో పోసుకుని గడగడా త్రాగాడు. వసంత అతడి ప్రక్కనే కిమ్మనకుండా చూస్తూ కూర్చుంది. ఒంటి మీద తెలివి వున్నంతవరకూ త్రాగి ప్రక్కమీద ఒరిగిపోయాడు రాజేశ్వర్రావు.

వరుసగా ఓ వారం రోజులిలా జరిగింది. ఓరోజు ఓగ్లాసు త్రాగగానే తల తిరగడం మొదలుపెట్టింది. నాలుగైదు పెద్ద వాంతులయ్యాయి. లేస్తే కళ్లు తిరుగుతున్నాయి. ఒంట్లో గాభరా ఎక్కువైంది.

"వసంతా!...... వసంతా!....." అంటూ బిగ్గరగా అరిచాడు.

"ఏం జరిగిందండి?" అంటూ పరుగు పరుగున వచ్చి అతడి పరిస్థితి చూసి కంగారు చెందింది.

"డాక్టరు.... వసంతా..... డాక్టర్ని పిలు....."

"వసంత అతడ్ని పట్టుకుని సోఫాలో మెల్లగా పడుకోబెట్టి ఫేనువేసింది. ముఖం మీద చల్లటి నీళ్లు జల్లి తలపట్టుకుంది. రాజేశ్వర్రావు కొంచెం తేరుకుని ఆమె ఒడిలో అలాగే నిద్రపోయాడు.

తరువాత నాలుగైదు రోజులు త్రాగబోయేసర్కి మళ్లీ వాంతులు, తలత్రిప్పు పట్టుకుంది. దాంతో రాజేశ్వర్రావుకు భయం పట్టుకుంది.

"ఏం వసంతా! మీ శ్రీవారిప్పుడెలా వున్నారు?" నవ్వుతూ వచ్చింది డాక్టర్ సుశీల.

నీధర్మమా అని మా సంసారం బాగుపడింది! మావారికిప్పుడు దానిపేరు చెప్తేనే సింహ స్వప్నం! నీ రుణం తీర్చుకోలేను" అంది వసంత.

"మన గుట్టుమాత్రం బయటపడలేదుకదా?" అంటూ చిరునవ్వు నవ్వింది డాక్టర్ సుశీల.

*'వినోదిని' జూలై 1954.*